ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శుక్రవారం 9 మే 2025



రైల్వేస్టేషన్‌లో మాక్‌డ్రిల్‌ను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, జేసీ, కమిషనర్ తదితరులు







భవనంపై నుంచి వ్యక్తిని కిందకు దించుతున్న దృశ్యం

ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొంటాం

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ● కడప రైల్వేస్టేషన్‌లో మాక్‌డ్రిల్

కడప ఎర్రముక్కపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొంటామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. కేంద్ర, రాష్ట్ర మార్గదర్శకాలకు అనుగుణంగా గురువారం కడప రైల్వేస్టేషన్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అకస్మాత్తుగా ఏదైనా ప్రమాదం జరిగితే ప్రజలు ఎలా స్పందించాలో అప్రమత్తం చేస్తున్నామన్నారు. అనుకోని రీతిలో ఉగ్రదాడులు జరిగినా, బాంబులు పేలినా, అగ్ని ప్రమాదాలు వాటిల్లినా ఎలా వ్యవహరించాలి అనే అంశాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ రక్షణ దళాలు చేసిన ప్రదర్శనలు చాలా ఉత్కంఠభరితంగా ఉన్నాయన్నారు. జిల్లాలోని ఎన్టీపీసీ, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, యూసీఐఎల్‌తో పాటు రైల్వేస్టేషన్లు, విమానాశ్రయం, బస్‌స్టాండ్ లాంటి జనసంచార ప్రదేశాల్లో సాధారణ సివిల్ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నామన్నారు. అగ్నిమాపక వాహనాలను, అంబులెన్స్‌లు, ఎమెర్జెన్సీ రెస్పాన్స్ టీములు, ఎమెర్జెన్సీ సహాయక వాహనాలు, తాత్కాలిక వైద్య శిబిరాలు ఏర్పాటుచేశామని, రక్షణ చర్యల్లో వినియోగించే అన్ని రకాల పరికరాలను ప్రదర్శనలో ఉంచామని కలెక్టర్ వివరించారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా నిర్వహించిన ఆపరేషన్లలో సివిల్ డిఫెన్స్, అగ్నిమాపక, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, పోలీసు, కేఎంసీ, రెవెన్యూ, సివిల్ సప్లైస్, వైద్యశాఖ, పలువురు వలంటీర్లు భాగస్వామ్యమవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు.

యుద్ధ వాతావరణం తలపించిన మాక్‌డ్రిల్

కడప రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన సివిల్ మాక్‌డ్రిల్ యుద్ధవాతావరణాన్ని తలపించింది. పెహల్గాం ఘటన నేపథ్యంలో దాయాది పాకిస్థాన్‌తో ఏ క్షణంలోనైనా యుద్ధం జరిగే అవకాశాలున్నాయనే అనుమానంతో దేశవ్యాప్తంగా సివిల్ మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించాయి. దీనితో జిల్లా యంత్రాంగం గురువారం కడప రైల్వేస్టేషన్‌లో మాక్ డ్రిల్ నిర్వహించింది. శత్రు దేశం నుంచి బాంబుల దాడి జరిగితే చెవులు మూసుకుని పడుకోవడం, ఇళ్లపై చిక్కుకున్న వారిని రెస్క్యూ బృందాలు రక్షించడం, గాయాలపాలైన వారికి తక్షణ వైద్యసేవలు అందించడం, మరికొందరిని అంబులెన్సుల్లో ఆసుపత్రికి తరలించడం వంటి చర్యలన్నీ నమూనాగా ప్రదర్శించారు. రోప్‌ల సాయంతో భవనాలపై నుంచి కిందకు ఎలా దిగాలో చేసి చూపించాయి. ఆయా దృశ్యాలను చూసిన వారికి నిజంగానే శత్రువుల దాడి జరిగిందా అనే అనుమానం కలిగేలా మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ క్రమంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రత్యేక వాహనంలో ఉండే పరికరాల వినియోగం, వాటితో ప్రమాదం నుంచి ఎలా తప్పించుకోవచ్చో ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. మాక్‌డ్రిల్‌ను జేసీ అదితిసింగ్, కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, కేఎంసీ కమిషనర్ మనోజ్‌రెడ్డి, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు దగ్గరుండి పర్యవేక్షించగా పలువురు పోలీసు, ఆర్పీఎఫ్, మెడికల్, జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



గాయాలైన వారిని ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

అదాని గ్రీన్ ఎనర్జీకి భూకేటాయింపులు

కడప, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొండాపురం మండలం కె.బొమ్మేపల్లెలో 1000 మెగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టును అదాని గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఏర్పాటు చేస్తోంది. దీనికి అవసరమైన కె.బొమ్మేపల్లె సర్వేనెంబర్ 307లో ఉన్న 150ఎకరాలు, సర్వేనెంబర్ 308లో 41.64 ఎకరాలు.. మొత్తం 191.64 ఎకరాల కేటాయింపునకు మంత్రిమండలి ఆమోదించింది. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రి మండలి సమావేశం జరిగింది. ఇందులో రాష్ట్రవ్యాప్తంగా పలు అంశాలపై నిర్ణయం తీసుకున్నారు. కె.బొమ్మేపల్లెలో నెడ్‌క్యాప్ సూచన మేరకు ఎకరాకు రూ.31వేల లీజుతో ఈ భూములను గ్రీన్ ఎనర్జీకి కేటాయించారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి 5శాతం లీజు మొత్తం పెంచనున్నారు. ఈ మేరకు కేబినెట్ తీర్మానించింది.

అంగరంగ వైభవంగా మహానాడు

● అతిథులకోసం టోల్‌ఫ్రీ నెంబర్ ● పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): మహానాడు కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి తెలిపారు. గురువారం కడప నగరం ద్వారకానగర్‌లోని శ్రీనివాసరెడ్డి నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే స్థల సేకరణ పూర్తయిందని పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. అతిథులందరికి వసతి సౌకర్యాలు ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా టోల్‌ఫ్రీ నెంబర్ 9063596644కు ఫోన్ చేయాలని సూచించారు. వచ్చే అతిథుల కోసం వసతి ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. మొదటి రోజు 40వేల మంది, రెండవ రోజు 50వేల మంది హాజరవుతారని అన్నారు. చివరి రోజు ఐదు లక్షల మందితో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహానాడు విజయవంతానికి అందరం కలిసికట్టుగా కృషిచేస్తామన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులు అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలి

● డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

కడప కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): యుద్ధ సమయాలలో ప్రజల ఆరోగ్య విషయంలో ప్రైవేట్ ఆసుపత్రుల వైద్య సిబ్బంది అత్యవసర సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు ఆదేశించారు. గురువారం తన కార్యాలయం నుంచి ప్రైవేటు ఆసుపత్రుల వైద్య సిబ్బందికి సివిల్ డిఫెన్స్ సన్నద్ధతపై జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సివిల్ డిఫెన్స్ సంసిద్ధతపై తగు సూచనలు చేశారు. ఆసుపత్రుల్లో అత్యవసర మందులు, వైద్య సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అత్యవసర, ట్రామాకేర్ కోసం ప్రత్యేక వార్డు, స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ఆసుపత్రి సిబ్బందితో మాక్‌డ్రిల్ నిర్వహించాలని, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్, వాటర్ గన్ ఉపయోగాలపై, సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వాలన్నారు. గ్యాస్ రీ ఫిల్ చేయాలని, ఫుల్ ఆక్సిజన్ సిలిండర్లు ఉండాలని, అత్యవసర నిష్క్రమణ మార్గాలు ఉపయోగించడానికి స్పష్టమైన సైన్ బోర్డు ఉంచాలన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, డాక్టర్లు రవి, రమేష్, డెమో రమణమ్మ, ఎస్‌ఓ రమేష్ రెడ్డి, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు.

ముగ్గురిని బలిగొన్న కంటైనర్

● బైకును వెనక నుంచి ఢీకొనడంతో ఘటన





మృతులు బాలయ్య, మల్లికార్జున



ప్రమాదానికి కారణమైన మినీ కంటైనర్

పెండ్లిమర్రి, మే 8 (ఆంధ్రజ్యోతి): కడప పులివెందుల ప్రధాన రహదారిపై కొత్తగంగిరెడ్డిపల్లె సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు.. వేంపల్లె శ్రీరామ్‌నగర్‌కు చెందిన కొర్రకూటి బాలయ్య(50) బేల్దారి కాగా రాజీవ్ కాలనీకి చెందిన సిద్దా మల్లికార్జున(45) కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరూ స్నేహితులు. మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన మట్ల మల్లికార్జున(30) కొర్రకూటి బాలయ్య తోడల్లుని కొడుకు. ఇతను బంధువులను చూసేందుకు వేంపల్లెకు వచ్చాడు. వీరు ముగ్గురూ గురువారం మధ్యాహ్నం పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వేంపల్లె నుంచి నందిమండలం గ్రామానికి వెళుతుండగా.. మార్గమధ్యంలో కొత్తగంగిరెడ్డిపల్లె సమీపంలో వెనక వైపు నుంచి మినీ కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సిద్దా మల్లికార్జున, మట్ల మల్లికార్జున అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ బాలయ్యను వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒకేసారి ముగ్గురు చనిపోవడంతో వారి కుటుంబాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సంఘటన స్థలాన్ని సీఐ చల్లనిదొర, ఎస్సై మధుసూదన్‌రెడ్డి పరిశీలించి ప్రమాద వివరాలను సేకరించారు. ఈ మేరకుకేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా బ్రహ్మరథోత్సవం

● వీరబ్రహ్మేంద్ర స్వామి నామస్మరణతో మారుమోగిన బ్రహ్మంగారిమఠం



రథానికి పూజలు చేస్తున్న వీరబ్రహ్మేంద్ర స్వామి కుటుంబ సభ్యులు



బ్రహ్మంగారి మఠంలో ఊరేగుతున్న బ్రహ్మరథం



బ్రహ్మరథంపై కొలువుతీరిన బ్రహ్మంగారు, గోవిందమాంబ

బ్రహ్మంగారిమఠం, మే 8(ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజ మహోత్సవాల్లో భాగంగా గురువారం బ్రహ్మరథోత్సవం వైభవంగా జరిగింది. బ్రహ్మరథానికి పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి కుటుంబ సభ్యులు, ఈశ్వరీదేవి అమ్మవారి మఠాధిపతి వీరకుమారస్వామి, బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్, దేవదాయశాఖ అధికారులు పూజలు నిర్వహించారు. బ్రహ్మరథం వీరబ్రహేంద్రస్వామి దేవస్థానం ప్రధాన గోపురం నుంచి మాడ వీధుల గుండా అశేష భక్త జనావళి మధ్య వైభవంగా నిర్వహించారు. రథం వెంబడి భక్తులు జై వీరబ్రహ్మ జై.. జై గోవిందమాంబ జై.. అంటూ ముందుకు సాగారు. భక్తి గీతాలు, యువకుల చిందులు, డప్పు వాయిద్యాలు, చిన్నారుల కోలాటాలతో రథోత్సవం వైభవంగా సాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సీఐ శివశంకర్‌యాదవ్ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను దేవస్థానం ఫిట్ పర్సన్ శకంర్‌బాలాజీ, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ గురుమూర్తి పర్యవేక్షించారు.

ఇసుక తోడేళ్లు



జమ్మలమడుగు, మే8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ఇసుక అక్రమ రవాణా దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెన్నానదిని కొల్లగొట్టడం మరింతగా పెరిగింది. ప్రొద్దుటూరు రోడ్డులోని పి.సుగుమంచిపల్లి, పెద్ద దండ్లూరు, సున్నపురాళ్లపల్లె, దేవగుడి, చలివెందుల ప్రాంతాల్లోని పెన్నానదిలో ఇసుక అక్రమ రవాణా పెరిగింది. అలాగే దానవులపాడు, ధర్మాపురం, గొరిగెనూరు గ్రామాల మధ్య ఇసుక ట్రాక్టర్ల జోరు పెరిగింది. అంబవరం, గూడెం చెరువు, జమ్మలమడుగు, ముద్దనూరు రోడ్డులో వంతెన పక్కన పెన్నానదిలో రాత్రి, పగలు ఇసుక తరలిపోతోందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముద్దనూరు రోడ్డులో వంతెన పక్కన వైసీపీ ప్రభుత్వంలో అప్పటి కాంట్రాక్టర్ పెన్నానదిలో ఇసుక తరలించేందుకు వేసిన గ్రావెల్ రోడ్డు ప్రస్తుతం ఇసుక అక్రమ రవాణా చేసే యజమానులకు అనుకూలంగా మారిందని అంటున్నారు. అలాగే సున్నపురాళ్లపల్లె, దేవగుడి గ్రామాల మధ్య పెన్నానదిలో రాత్రి సమయంలో ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిస్తున్నారు. అన్ని పార్టీలకు చెందినవారు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపణలున్నాయి. జమ్మలమడుగు పెన్నానది పరిసర ప్రాంతాల్లో ఇసుక దోపిడీకి కళ్లెం వేయకపోతే భవిష్యత్తులో ఇసుక ఉండదని, ఇప్పటికే గుంతలు దర్శనం ఇస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జమ్మలమడుగు, మైలవరం పరిసర ప్రాంతాల్లో అధికారులు పెన్నానదిని సందర్శించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జమ్మలమడుగు వద్ద వంతెన పక్కన పెన్నానదిలో ఇసుక కోసం వెళుతున్న ట్రాక్టర్.. నదిలో ఉన్న ట్రాక్టర్లు, టిప్పర్లు

మట్టి మాఫియా

దువ్వూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మట్టి మాఫియా చెలరేగి పోతోంది. దువ్వూరు మంలంలోని నీలాపురం వద్ద అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ ఆర్అండ్‌బీ తారు రోడ్డును ఆనుకుని 15-20 అడుగుల లోతు తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ దారి గుండా నిత్యం ఆటోలు, ఇతర వాహనాలు తిరుగుతుంటాయి. పొరపాటున అదుపు తప్పి వాహనాలు అందులో పడితే ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. రైతులు పొలాలకు చెరువులో మట్టి తోలుకుంటే దాడులు చేసి జరిమానాలు విధించిన సంఘటనలు ఉన్నాయి. ఇలా రోడ్డు పక్కన అక్రమంగా గ్రావెల్ తవ్వి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు అడ్డుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. నీలాపురం పరిసరాల్లో రెండు ఎక్సకవేటర్లతో తవ్వకాలు చేసి మట్టిని తరలిస్తున్నారు. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే రాజకీయ నాయకులతో ఫోన్లు కలపడంతో పాటు బెదిరింపులకు దిగుతున్నారని అంటున్నారు. ఈ ప్రాంతంలో గతంలో చేపట్టిన తవ్వకాలతో గుంతలు ఏర్పడి నీరు చేరడంతో ఇద్దరు పసిపిల్లలు, మరో యువకుడు అందులో పడి మృతిచెందారు. సమీపంలోనే జిల్లా పరిషత్ హైస్కూలు ఉంది. విద్యార్థులు ఇటువైపు తిరుగుతుంటారు. ఇప్పటికైనా అధికారులు మట్టిమాఫియాకు చెక్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై దువ్వూరు తహశీల్దారు అక్బల్‌బాషాను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. అక్రమ తవ్వకాలను అడ్డుకుంటామని అన్నారు. వీఆర్వో ద్వారా విచారణ చేపట్టి ఎక్సకవేటర్లు, ట్రాక్టర్ల వివరాలు లభ్యమైతే వాటిని సీజ్ చేయడంతో పాటు సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డును ఆనుకుని సుమారు 15 అడుగుల లోతుతో అక్రమంగా మట్టిని తవ్వేసిన దృశ్యం





దువ్వూరు మండలం నీలాపురం వద్ద అక్రమంగా తవ్వుతున్న గ్రావెల్

ఎస్సీ రుణాల గడువు పొడిగించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎన్టీఆర్‌సర్కిల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్ నమోదు గడువును పొడిగించాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పీఆర్ఎస్ వైఎఫ్)డిమాండ్ చేసింది. ఈ మేరకు పీఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జి.రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దళిత నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాల మంజూరు కోసం ప్రకటన చేసిందని, రుణాల కోసం లబ్ధిదారులను ఏప్రిల్ 15 నుంచి మే 10 లోపు ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని ప్రకటన విడుదల చేశారన్నారు. కానీ ఆన్‌లైన్ సర్వర్ అంతరాయం, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జాప్యం కారణంగా మరికొన్ని గడువు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

జమ్ము తొలగింపునకు ప్రతిపాదనలు

ఎన్టీఆర్‌సర్కిల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్‌లోని ప్రధాన కాలవలు, ఉపకాలువలో జమ్ము, పిచ్చిమొక్కల తొలగింపునకు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపినట్లు కేసీకెనాల్ ఏఈ గంగిరెడ్డి పేర్కొన్నారు. కేసీ కాలువలో నీటి మొక్కలు తొలగించేది ఎప్పుడు అనే శీర్షికన ఈ నెల 6న ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి స్పందించి ఆయన వివరణ ఇచ్చారు. కాలవల్లో జమ్ము, గుర్రపు డెక్క, వివిధ రకాల పిచ్చి మొక్కలతో సాగు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకు అవసరమైన అంచనాలను తయారు చేసి పంపించామన్నారు.

నేడు మహిళలకు ఉద్యోగావకాశాలు


మాట్లాడుతున్న ఏపీఎం అంజనేయులు

వేముల, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వేములలోని వెలుగు కార్యాలయంలో నిరుద్యోగ మహిళలకు ఉద్యోగాల కల్పనకై ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పులివెందులలోని ఆదిత్య బిర్లా గార్మెంట్స్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలు ఉన్నాయని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 5వ తరగతి పాస్, ఆపైన చదువు ఉండి, 38 ఏళ్లలోపు మహిళలు ఉద్యోగాలకు అర్హులన్నారు.

రైతుల శ్రేయస్సు కోసమే రీసర్వే


రైతులతో మాట్లాడుతున్న సర్వేయర్

చెన్నూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములు ఉన్న ఏ రైతు కూడా భవిష్యత్తులో ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం రీసర్వే నిర్వహించి వారికి పక్కాగా రికార్డులు అందజేస్తుందని మండల సర్వేయర్ సోమశేఖర్ అన్నారు. మండలంలోని బైనపల్లె రెవెన్యూ గ్రామంలో రెండవ దశ రీసర్వే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వేయర్ రైతులతో మాట్లాడుతూ బైనపల్లె రెవెన్యూ గ్రామంలో మొత్తం 693.79 ఎకరాలు ఉందని, ఇందులో 316 సర్వే నెంబర్లలో 466 మంది పట్టాదారులు ఉన్నారన్నారు. పట్టాభూమి 507.02 ఎకరాలు, ప్రభుత్వ భూమి 186.65 ఎకరాలు ఉందన్నారు. ఈ భూములకు సంబంధించి రైతులకు రీసర్వేకు హాజరయ్యే విధంగా నోటీసులు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓలు లక్ష్మీ, వినోద్, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

నేడు పాలేటి గంగమ్మ తిరునాళ్లు

కమలాపురంరూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.చదిపిరాళ్ల గొప్పల్లె గ్రామాల మధ్య వెలసిన పాలేటి గంగమ్మ (మంచాలమ్మ) తిరునాళ్ల మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదానం నిర్వహిస్తున్నామని, సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అలాగే పాలపళ్ల ఎడ్లచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు వరుసగా రూ.25,016, రూ.20,016, రూ.15,016, రూ.10,016, రూ.7016, రూ.5016, రూ.3016 నగదు బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన ఎడ్ల యజమానులు ఆలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని వారు తెలిపారు.

ఎస్పీని సత్కరించిన లయన్ ఖాసింఖాన్

కడప క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను గురువారం లయన్ ఖాసింఖాన్ ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. జిల్లాలో శాంతిభద్రతల విషయంగా పటిష్ట సేవలందిస్తున్న తీరుపట్ల హర్షం వ్యక్తం చేశారు.


ఎస్పీని సత్కరిస్తున్న ఖాసింఖాన్

రోడ్డెక్కిన పారిశుధ్య కార్మికులు

● ఐదు నెలలుగా జీతాలివ్వలేదంటూ నిరసన


వేంపల్లె పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న దృశ్యం

వేంపల్లె, మే 8 (ఆంధజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీలో పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగారు. ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమని, ఇంట్లో పూట కూడా గడవడం లేదని ఆవేదనతో పారిశుధ్య పనులను నిలిపివేశారు. వేతనాలు ఇచ్చే వరకు పనులకు వెళ్లేది లేదని స్పష్టం చేశారు. గురువారం ఉదయం పనికి వెళ్లకుండా తమ నిరసనను వ్యక్తం చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయానికి చేరుకొని బైఠాయించి నిరసన తెలిపారు. వారికి మద్దతుగా పంచాయతీ నీటి సరఫరా సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు మద్దతు తెలిపి నిరసన వ్యక్తం చేశారు. ఈఓ రామసుబ్బారెడ్డి లీవ్‌లో ఉండడంతో జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ ఈఓతో ఫోన్‌లో మాట్లాడించారు. శుక్రవారం వచ్చి నిధులు ఉన్న మేరకు వేతనాలు ఇస్తామని చెప్పినప్పటికీ పారిశుధ్య, నీటి సరఫరా సిబ్బంది అంగీకరించలేదు. పూర్తిస్థాయిలో వేతనాలు ఇచ్చే వరకు పనులు చేసేది లేదంటూ ఈఓకు స్పష్టం చేశారు. అక్కడే బైఠాయించి ఆందోళన సాగించిన కార్మికులు అనంతరం ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో పట్టణంలో పారిశుధ్య పనులు చేపట్టక ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. మరోవైపు నీటి సరఫరాకు కూడా ఆటంకాలు ఏర్పడ్డాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటి సరఫరాను నిలపద్దు: సర్పంచు

తాగునీటి సరఫరాను నిలపద్దని నీటి సరఫరా సిబ్బందికి సర్పంచు ఆర్.శ్రీనుకు ఆదేశించారు. తాగునీరు లేకుంటే ప్రజలు ఇబ్బందులు పడతారని, త్వరలోనే వేతనాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నీటి సరఫరా విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

● ఏఐటీయూసీ ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు

కడప మారుతీనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రతిష్టాత్మకంగా వచ్చే ఆగస్టు 30, 31, తేదీలలో కడపలో తలపెట్టిన ఆశా వర్కర్స్ యూనియన్ మూడవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు వెంకటసుబ్బయ్య, మహిళా నాయకురాలు కె.స్రవంతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, ఎల్.నాగసుబ్బారెడ్డిలు ఆశాలకు పిలుపునిచ్చారు. ఆ మేరకు రాష్ట్ర మహాసభల జయప్రదాన్ని కాంక్షిస్తూ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి అధ్యక్షతన ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో గర్భవతులకు, బాలింతలకు, నవజాతా శిశువులకు వైద్యసేవలు అందించడంలో ఆశావర్కర్లు ప్రధాన భూమిక పోషిస్తున్నారన్నారు. అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాల సేవలను గుర్తించకపోగా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా వుండగా స్కీం వర్కర్లైన ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు సైతం తీర్చేందుకు పాలకులు సంసిద్ధం కావాలన్నారు. ఇందుకు నిరసనగా ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను దిగ్విజయం చేయాలన్నారు. సమావేశానంతరం ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాళ్లు చాముండేశ్వరి, నాగవేణి, వేదవతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మరియమ్మ, కల్పన, అమ్ములు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు చంద్రశేఖర్, కె.సి.బాదుల్లా, పలువురు ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

'ఎనర్జీ అసిస్టెంట్లకు అన్యాయం'

కడప సెవెన్‌రోడ్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ హక్కులను హరించే నిర్ణయాలు తీసుకోవడం మళ్లీ సవరణకై కమిటీల పేరుతో కాలయాపన చేయడం విద్యుత్ సంస్థలో ఇది పరిపాటిగా మారిందని గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. సచివాలయ వ్యవస్థలో భాగంగా 21 విభాగాలకు సంబంధించిన ఉద్యోగులు సచివాలయ కేంద్రంగా పనిచేస్తున్నారని వారందరికి కూడా వారి శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ అమలు చేస్తున్నారని కానీ ఒక్క ఎనర్జీ అసస్టెంట్లకు మాత్రం నూతన సర్వీస రూల్స్‌ను ప్రవేశపెట్టి విద్యుత్ యాజమాన్యం బానిస వ్యవస్థను మళ్లీ ఈ సమాజానికి పరిచయం చేస్తున్నందని వారు విమర్శించారు. ఎనర్జీ అసిస్టెంట్లకు న్యాయం చేయాలని లేనిపక్షంలో ఉద్యమించక తప్పదన్నారు.

భక్తి శ్రద్ధలతో సుదర్శన చక్రహోమం

కడప కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కలియుగ అవతారమూర్తి జగద్గురు మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవసమాధి కాబడిన సందర్భాన్ని పురస్కరించుకుని నగర మున్సిపల్ గ్రౌండ్ (శ్రీ అయ్యప్పస్వామి ఆలయం ప్రక్కన) వెలసిన గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ఆలయంలో గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో సుదర్శన చక్ర హోమం నిర్వహించారు. ఆ ఆలయ కమిటీ అధ్యక్షుడు ధనుంజయ ఆచారి ఆధ్వర్యంలో ఆలయంలో చేపట్టిన సుదర్శన చక్రహోమ కార్యక్రమ ఆద్యంతం పవిత్రంగా సాగింది. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

వెయ్యినూతులకోనలో ఛాయాదివాసం

పెండ్లిమర్రి, మే 8 (ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాల్లో బాగంగా గురువారం వెయ్యినూతులకోన ఆలయం నందు అష్టోత్తర ఛాయాదివాస స్నపనం కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే వేదపారాయణం, సాయంత్రం పంచశయ్యాధ వాసములు, శాత్తుమొర్రై నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని వేదపారాయణంలో పాల్గొన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

గాలివానకు నేలకొరిగిన మామిడిచెట్లు

● రాలిపోయిన కాయలు

చక్రాయపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అతిమారు ప్రాంతమైన ఎర్రగుడి, కల్లూరుపల్లె ప్రాంతాల్లో గురువారం సాయంత్రం వీచిన గాలివానకు మామిడిచెట్లు నేలకొరిగాయి. కాయలు కూడా రాలిపోయినట్లు రైతులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఎర్రగుడి, కల్లూరుపల్లె గ్రామాలలో గురువారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. వర్షానికి తోడు గాలితోడైంది. పెద్దపెద్ద చెట్లు సైతం నేలకొరిగాయి. అక్కడక్కడ ఉన్న కాయలు రాలిపోయాయి. ఎర్రగుడికి చెందిన సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాబురెడ్డిలతో పాటు మరికొందరివి దాదాపు 150 చెట్ల దాకా నేలకొరిగాయని, పదేళ్ల సాకిన చెట్లు నేలవాలడంతో తీవ్రంగా నష్టపోయామని వారు వాపోతున్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన కమిషనర్


కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న లేవాకు ట్రస్ట్ ప్రతినిధులు లేవాకు లక్ష్మిరెడ్డి, నితీశ్‌కుమార్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): లేవాకు నారపరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కడప కమిషనర్ ఎస్.మనోజ్‌రెడ్డి ప్రారంభించారు. గత 20 ఏళ్ల నుంచి వేసవిలో కడప ముఖ్య కూడళ్లలో 23 చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున వంద రోజుల పాటు చలివేంద్రాలను నిర్వహించడం డబ్బు శ్రమతో కూడిన పని అని, అంతటి గొప్ప కార్యక్రమాలను నిర్వహిస్తున్న లేవాకు ట్రస్టును అభినందించారు. లేవాకు లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రాలు, ట్యాంకరు, పశుగ్రాసం తదితర సేవా కార్యక్రమాలను ఆదరిస్తున్న కడప ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ లేవాకు నితీశ్‌కుమార్‌రెడ్డి, లేవాకు రఘునాథరెడ్డి, రాజారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సురేంద్ర, శివ, మాధవి, భారతి, సభహ, ప్రభాకర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం పిల్లలకు ఉపయోగం

వల్లూరు మే 8 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం వలన పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా వుంటుందని లైబ్రేరియన్ వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం మండల కేంద్రమైన వల్లూరు గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పిల్లలను గ్రంథాలయానికి తీసుకువచ్చి అక్కడున్న వివిధ పుస్తకాలను చదివించారు.

క్రీడల పట్ల పిల్లలను ప్రోత్సహించాలి

● క్రీడా పరికరాల పంపిణీలో ఎమ్మెల్యే మాధవి

కడప స్పోర్ట్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలను క్రీడల పట్ల ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ఆర్.మాధవి తల్లిదండ్రులకు సూచించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రిమ్స్ సమీప క్రీడాపాఠశాలలో ఈ నెల 1 నుంచి 31 వరకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ క్రీడా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. వేసవి క్రీడా శిక్షణ శిబిర నిర్వహణలో భాగంగా క్రీడాపరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్నాథరెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ సెక్రటరీ ప్రవీణ్‌కిరణ్, పలువురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌ను బలోపేతం చేద్దాం : సురేష్‌కుమార్


హెన్రీ డ్యూనంట్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సెక్రటరి

కడప(వినాయకనగర్), మే 8(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖను అందరం సమన్వయంతో బలోపేతం చేద్దామని ఆ శాఖ జిల్లా సెక్రటరీ, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎ.సురేశ్‌కుమార్ అన్నారు. నగరంలోని మట్టిపెద్దపులి సర్కిల్‌లో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యాలయంలో గురువారం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన రెడ్‌క్రాస్ సీనియర్ సభ్యులు జానమద్ది విజయభాస్కర్, శివారెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు తదితరులతో కలిసి రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా సెక్రటరీ మాట్లాడుతూ హెన్రీ డ్యూనంట్ జన్మదినం సందర్భంగానే ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఇదిలా ఉండగా రెడ్‌క్రాస్‌కు కలెక్టర్ ప్రెసిడెంట్ గానూ, డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ స్పెషలాఫీసర్ గానూ ఉన్నారని, వీరి సహకారంతో జిల్లాలో మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొని సంస్థకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ముఖ్యంగా మొక్కలు నాటడం, ప్రథమ చికిత్సపైన శిక్షణ ఇవ్వడం, జూనియర్, యూత్ రెడ్‌క్రాస్‌లో విద్యార్థులను భాగస్వామ్యం చేసి వారి ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కోఆర్డినేటర్‌కు పలు సూచనలు జారీ చేశారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు రెడ్‌క్రాస్ సభ్యులు మాట్లాడారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ యశస్విని, డిస్ట్రిక్ కోఆర్డినేటర్ సుధాకర్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ స్వరూపారాణి, వైస్ ప్యాట్రన్ జాలా ప్రభాకర్, సభ్యులు జ్యేష్టాది వసంత్, విష్ణువర్ధన్, నాగమల్లారెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఉగ్రస్థావరాలపై దాడులు సమర్థనీయం

కడపసెవెన్‌రోడ్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): నిర్దిష్ట లక్ష్యాలపైనే దాడులు మన త్రివిధ దళాల యుద్ధ నైపుణ్యానికి నిదర్శనాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 2025 ఏప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీర్‌లోని పెహల్గాంలో పర్యాటకులు, అమాయకులైన భారత పౌరులపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులను భారత ప్రభుత్వానికి, పాకిస్థాన్ భేషరతుగా అప్పగించాలని డిమాండ్ చేశారు. యుద్ధాలు లేని ప్రపంచం కోసం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి, జనరల్ కౌన్సిల్, అంతర్జాతీయ న్యాయస్థానాలు, శక్తివంతంగా పనిచేయాలని కోరారు.

హోం కంపోస్టు ప్రక్రియ అమలు చేయాలి : కమిషనర్


మాట్లాడుతున్న కమిషనర్ జగన్నాథం

కమలాపురంరూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో ప్రతి గృహిణి తమ ఇంటి నుంచి వచ్చే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి, తడి చెత్తను కంపోస్టింగ్ చేయడం ద్వారా హోం కంపోస్టింగ్‌ను తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్పీలు, శానిటరీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గృహిణి ఇంటి నుంచి వచ్చే చెత్తను వేరు చేయాలన్నారు. తద్వారా రసాయనిక ఎరువులు కాకుండా సహజ సిద్ధమైన హోం కంపోస్టింగ్ ద్వారా తయారైన ఎరువుల ద్వారా పెరిగిన కూరగాయలు, పూలమొక్కలు బలవర్థకంగా ఉంటాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల నరసింహులు, సీఓలు లావణ్య, ప్రజ్యోత్ మెప్మా ఆర్పీలు, శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన


పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

సీకెదిన్నె, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇందిరానగర్‌లో రూ.20 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీ వాసులు తమ సమస్యలను ఎమెల్యే దృష్టికి తీసుకురాగా అక్కడే ఉన్న అధికారులకు తెలిపి త్వరగా వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా


వేంపల్లె రాజీవ్‌కాలనీలో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్న దృశ్యం

వేంపల్లె, మే 8 (ఆంధ్ర జ్యోతి): వేంపల్లె రాజీవ్‌కాలనీకి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా గురువారం చేశారు. పంచాయతీ కార్యాలయంకు ఖాళీబిందెలతో రాజీవ్‌కాలనీ మహిళలు వచ్చి నిరసన తెలియజేయడంతో సమస్య తీవ్రతను గుర్తించిన సర్పంచు ఆర్.శ్రీను ట్యాంకర్లను పంపించారు. తాత్కాలికంగా నీటి సమస్యకు పరిష్కారం చూపారు. బోరులోకి పైపులు మరింత లోతుకు దింపి నీటి సమస్య పరిష్కరిస్తామని సర్పంచు తెలిపారు.

డీడీపై చర్యలు తీసుకోవాలి: సీఐటీయూ

కడప సెవెన్‌రోడ్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పనిచేస్తున్న ఏపీకాస్ పట్ల డీడీ వ్యవహరిస్తున్న తీరుపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్యలు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్ రంగస్వామికి ఆసుపత్రిలో వినతిపత్రం అందించారు.

నవధాన్య కిట్లు ప్రయోజనకరం

వేముల, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో నవధాన్య కిట్లు ఎంతో ప్రయోజనకరమని సీఎస్‌ఏ ఎఫ్‌పీఏ, రైతు సాధికార సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం వేములలో పీఎండీఎస్ నవధాన్య కిట్లు తయారు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు సాగుచేసుకునే రైతులకు ఈ నవధాన్య కిట్లు ఉపయోగించడం వల్ల భూమి గుల్లబారుతుందన్నారు. ఎంటీలు భాస్కర్‌రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి రామ్మోహన్‌నాయుడులు పీఎండీఎస్ (నవధాన్య) తయారీని వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి అంజన్‌రెడ్డి, రోజా, రైతులు పాల్గొన్నారు.

ఆపరేషన్ విజయవంతంతో సంబరాలు

కడప నాగరాజుపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంపై జేకే క్రీడా విద్యా సాంస్కృతిక అభివృద్ధి రాష్ట్ర అధ్యక్షుడు లయన్ పఠాన్ ఖాదర్‌బాష ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ బుధవారం తెల్లవారుజామున 25 నిమిషాలు వ్యవధిలో తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన సాయుధ దళాలను చూసి గర్విస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టి జాతీయ జెండాలు చేతబట్టి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు సలీం, రఫి, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

27 బస్తాల బియ్యం స్వాధీనం - ఇద్దరి అరెస్ట్

చెన్నూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏటిగడ్డ వీధిలో అక్రమంగా నిల్వ చేసి ఉంచిన 17 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని మహమ్మద్ ముస్తాక్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. అలాగే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 12 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని శివకుమార్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అంతేకాకుండా తూర్పు వీధిలో పేకాట ఆడుతున్న నలుగురుపై దాడిచేసి రూ.4వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు.

బంగారు గొలుసు అపహరణ

కడప క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రిమ్స్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును ఓ యువకుడు లాక్కెళ్లాడు. సింగపూర్‌టౌన్‌లో నివాసం ఉంటున్న కాంచనమ్మ రిమ్స్‌లో పనిచేస్తున్నారు. గురువారం రాత్రి విధుల ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఘటన జరిగింది. దీంతో బాధితురాలు రిమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రహదారుల భద్రతకు పటిష్ట చర్యలు : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి రహదారుల భద్రత సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023లో మొత్తం 699 ప్రమాదాలు జరగ్గా 367 చనిపోయారని, 910 మంది గాయపడినట్లు తెలిపారు. 2024లో 649 ప్రమాదాల్లో 356 మరణాలు, 825 మందికి గాయాలయ్యాయన్నారు. 2025లో ఇప్పటి వరకు మొత్తం 253 ప్రమాదాలు జరగ్గా 123 చనిపోయారని, 272 మంది గాయపడినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రత్యేక దృష్టి సారించి రోడ్లలో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ వారి కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడపాలని, బయటికి వెళ్లి తిరిగి వచ్చేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను మరింత కఠినతరం చేయాలన్నారు. అతి వేగం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, బస్సులు ఇతర వాహనాల్లో అధిక లోడుతో సరుకు, ఇతర సామాగ్రి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖాధికారులను ఆదేశించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులను ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలో హిట్ అండ్ రన్ 24 కేసులకు పరిహారం ఇంకా మంజూరు చేయాల్సి ఉందని, ఈ విషయంలో 15 రోజుల్లోగా పరిహారం మంజూరుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, ఆర్డీవో శ్రీనివాస్, అడిషినల్ ఎస్పీ వెంకటాద్రి, ఆర్అండ్‌బీ జిల్లా అధికారి సహదేవరెడ్డి, జిల్లా రవాణా అధికారి ప్రసాద్, ఎంవీఐలు, పోలీసు అధికారులు, డీఎస్పీలు, ఎన్‌హెచ్ఏఐ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యం, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా జమున



కడప సెవెన్‌రోడ్స్, మే 8 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జమున గురువారం బాధ్యతలు చేపట్టారు. ఒంగోలు సర్వజన ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ జమునను డీఎంఈ ఆదేశాను సారం కడప రిమ్స్ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈ మేరకు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అడ్మినిస్ట్రేటర్ డిప్యూటీ కలెక్టర్ రంగస్వామితో పాటు, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెం ట్ డాక్టర్ రమాదేవి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విజయ భాస్కర్, విద్య వైద్య, వైద్యేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. రిమ్స్ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ సురేఖ నంద్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు.

పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలి


విద్యాశాఖాధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌వో మధుసూదన్‌రావు

రాయచోటి (కలెక్టరేట్), మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని జిల్లా రెవె న్యూ అధికారి మధుసూదన్‌రావు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్, జిల్లా విద్యాశాఖ కమిటీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 37 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 13,978 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షా కేంద్రాల్లో ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఇంటర్మీడియట్ ప్రశ్నపత్రాలను భద్రపరిచిన స్టోరేజ్ పాయింట్ల వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని సూచించారు. సమావేశం లో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, డీఈవో, పోలీసు, రెవెన్యూ, ఆర్టీసీ, మెడికల్, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ సమస్యలను పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబరు


మట్లాడుతున్న టిటిడీ బోర్డు మెంబర్ భానుప్రకాశ్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు మే 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని పురాతన నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాం గణంలో గత కొంత కాలంగా నెలకొన్న సమస్యలను టీటీడీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేష్ రెడ్డి భక్తులకు హామీ ఇచ్చారు. గురువారం వారు ఆలయాన్ని సందర్శించారు. ముందుగా శ్రీవారి సన్నిధిలో పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 10 నుంచి ప్రారంభమయ్యే వార్షిక బ్రహోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లపై ఆరా తీశారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఎస్ఐలు రామక్రిష్ణ, హైమావతి, కూటమి నాయకులు గోనా పురుషోత్తరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైకుల దొంగ అరెస్టు

- రూ.10 లక్షల విలువ చేసే ద్విచక్ర వాహనాలు స్వాధీనం


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

జమ్మలమడుగు మే 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రైల్వేస్టేషన్ వద్ద ముత్యాలపాటి దాదావలి బాషా అనే బైకుల దొంగను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం సాయంత్రం అర్బన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన దాదావలిబాషా బైక్‌మెకానిక్‌గా పనిచేసేవాడు. జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడేవాడు. ఈ నేపథ్యంలో తమ సిబ్బంది రైల్వేస్టేషన్ వద్ద వాహన తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంలో ఓ వ్యక్తి అనుమా నాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకొని విచారించారు. గత కొన్ని నెలల నుంచి రైల్వేస్టేషన్ వద్ద ద్విచక్ర వాహనాల చోరీ చేసినట్లు అంగీకరించాడు. 16 ద్విచక్రవాహనాలు, రెండు వాహనాల విడి భాగాలు అమ్ముకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.10 లక్షలు అవుతుందని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐలు లింగప్ప, ఎస్సైలు హైమావతి, రామక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మందులతో మాగబెడితే కఠిన చర్యలు

- జిల్లా ఆహార భద్రతా అధికారి


మండీలో తనిఖీలు చేస్తున్న జిల్లా ఆహార భద్రత ప్రమాణాల శాఖాధికారి షమీమ్‌బాషా

రాయచోటిటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): మామిడి కాయలను మందు పెట్టి మాగబెట్టి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఆహార భద్రతాధికారి షమీమ్‌బాషా హెచ్చరించారు. గురువారం ఆయన జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశాల మేరకు జిల్లా అగ్రికల్చర్ అండ్ ట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్ త్యాగరాజుతో కలిసి రాయచోటి పట్టణంలోని ఠానా సమీపంలోని మండీలో పలు మామిడి విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి పండ్లు ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు వ్యాపారులు వాటిపై రసాయనాలు చల్లకూడదని, అలాగే అలాగే పచ్చి మామిడి కాయలు త్వరగా మాగడానికి విషపూరితమైన కాల్షియం కార్బైడ్ మందును వినియోగించకూడదన్నారు. వ్యాపారులు ఎవరైనా రసాయనాలతో మామిడి పంట్లను మాగబెట్టి విక్రయిస్తే అటువంటి వారిపై ఆహార భద్రత ప్రమాణాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా అగ్రికల్చరల్ ట్రేడ్ అండ్ మార్కెటింగ్ శాఖ సీనియర్ అసిస్టెంట్ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారి సస్పెన్షన్ ?

కడప మారుతీనగర్, మే 8 (ఆంధ్ర జ్యోతి): ఆర్టీసీ కడప జోన్‌లో విధులు నిర్వహించే ఓ అధికారిపై ఇటీవల అవినీతి, ఆరోపణలు రావడంతో ఆయనను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ప్రతి నెలా సంబంధిత ఉద్యోగుల నుంచి మామూళ్లకు పాల్పడుతున్నారని, సంబంధిత ఉద్యోగులు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో పైస్థాయి అధికారుల విచారణ చేపట్టి వాస్తవాలను రుజువు చేసి ఆ మేరకు సస్పెండ్ చేసినట్లుగా తెలిసింది.

ఆపరేషన్ సిందూర్ చారిత్రాత్మకం : తులసిరెడ్డి

వేంపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): భారత రక్షణ దళాలు మే 7వ తేదీ తెల్లవారుజామున నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ చారిత్రాత్మకమైనదని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్‌లోని నాలుగు, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఐదు ఉగ్రవాద శిబిరాలపై దాడి చేయడం సాహసోపేతమన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. వ్యక్తి మృతి


మృతి చెందిన నరసింహులు (ఫైల్)

బద్వేలు టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గందంశెట్టి నరసింహులు (68) అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బద్వేలు పట్టణంలో చోటు చేసుకొంది. వివరాల్లోకి వెళితే.. ఇరిగేషన్ శాఖలో నరసింహులు వాచ్‌మెన్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందాడు. పోస్టాఫీసులో పని నిమిత్తం గురువారం ఉదయం గానుగపెంట నుంచి ఆర్టీసీ బస్సులో బయలుదేరి బద్వేలుకు వచ్చి బస్టాండ్‌లో దిగాడు. నరసింహులు నడుచుకుంటూ చిన్నగా వస్తుండగా అదే బస్సు మళ్లీ బస్టాండు నుంచి వస్తుండగా మలుపు తిరిగే దగ్గర ఢీకొని ముందు టైర్ తలపై ఎక్కడంతో నరసింహు లు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో 20 నిమిషాలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న బద్వేలు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రధాన రహదారుల్లో తోపుడు బండ్లు రోడ్డుకు అడ్డదిడ్డంగా పెట్టి వ్యాపారాలు చేస్తుండటంతో ఈ ప్రమాదం చోటు చేసు కొందని బంధువులు ఆరోపిస్తు న్నారు. ఆర్టీసీ డీఎం సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె కలరు. బంధువులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


సంఘటన స్థలంలో మృతిచెందిన మహిళ

కమలాపురం రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లె గ్రామ సమీపంలో ఉన్న కోర్‌లాజిస్టిక్ కంపెనీ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల నిర్మల (40) అనే మహిళ మృతి చెందింది. ఎస్ఐ విద్యాసాగర్‌రావు వివరాల మేరకు... గురువారం సాయంత్రం 4.30 గంటలకు కడప వైపు నుంచి వస్తున్న కారును ఎర్రగుంట్ల వైపు నుంచి వస్తున్న తుఫాన్ వాహనం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఎర్రగుంట్ల టౌన్ క్రాంతినగర్‌కు చెందిన నంద్యాల నిర్మల అక్కడికక్కడే మృతి చెందారు. అదేకారులో ఉన్న ఆమె భర్తకు, ఇద్దరు చిన్నపిల్లలకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. తుఫాన్ డ్రైవర్ చెప్పలి నరసింహులు గాయపడినట్లు సమాచారం. గాయపడిన వారిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో...

కడప (క్రైం), మే 8 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సైనిక్ నగర్ సమీపంలో రోడ్డు పై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని వాహనం ఢీ కొనడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు ట్రాఫిక్ సీఐ జావేద్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 55 సంవత్సారాలు ఉంటుందని, మెడలో నలుపు, ఎరుపు కాశీ దారం ఉందన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృత్యదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9121100539 ఫోన్ చేసి మరింత సమాచారం తెలుసుకోవాలని సూచించారు.

ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి

పులివెందుల,మే 8 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురం గ్రామానికి చెందిన అన్వర్ అనే బీటెక్ విద్యార్థి ఈత కోసం వెళ్లి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పులివెందుల సమీపంలోని రాయలాపురం బ్రిడ్జి వద్ద ఉన్న నీటి కుంటలో సరదాగా ఈతకు వెళ్లి నీటిలో దిగి మునిగిపోయాడు. స్థానికులు గమనించి నీటిలో వెతికి అన్వర్‌ను వెలికితీసి హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పెద్దరంగాపురానికి చెందిన ఎస్.చిన్నమాములు, మస్తానమ్మల కుమారుడు అన్వర్ పుత్తూరులో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. ఉన్న ఒక్కగానొక్క కొడు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి.

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ


పులివెందుల, మే 8 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలం మడూరు గ్రామ సచివాలయంలో ఏఎన్ఎమ్‌గా విధులు నిర్వహిస్తున్న దీవెనమ్మ అనే మహిళ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు బంగారు గొలుసు లాక్కెళ్లారు. తొండూరు ఎస్ఐ వివరాల మేరకు... పులివెందుల వైపు నుంచి స్కూటర్‌పై మడూరుకు వెళ్తున్న దీవెనమ్మను దొండ్లవాగు సమీపంలో అడ్డగించి బెదిరించి.. మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపటి నుంచి రామాపురంలో బ్రహ్మోత్సవాలు


ఆలయ ముఖద్వారం

కమలాపురం రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామాపురంలో వెలసిన మహాలక్ష్మీ మోక్ష నారాయణస్వామి, శ్రీవల్లి దేవసేన సమేత ద్వికంధర షణ్ముఖ సుబ్రమణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు కాశీభట్ల సత్యసాయినాథ్‌శర్మ వెల్లడించారు. ఐదు రోజుల పాటు గుంటూరుకు చెందిన వేద పండితుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న ఆలయ ప్రధాన సేవకులు కాశీభట్ల సాయినాథ్‌శర్మ



పెంచలలో.. గోవిందో!

- కోనలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు
- అత్తారింటి నుంచి ఆలయానికి చేరుకున్న శ్రీవారు
- నవ వధూవరులకు గిరిజనుల సంప్రదాయ సారె


ఆలయంలో అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు


ఉభయదేవేరులతో పెంచలస్వామి

రాపూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : గోనుపల్లి గిరిజనవాడలు గోవింద పెంచల నామస్మరణలతో మారుమోగాయి. తప్పెట్లు, తాళాలు, బాజాభజంత్రీల నడుమ ఉభయ దేవేరులతో కలిసి పెంచల నృసింహుడు బ్రహ్మోత్సవాలు చేసుకునేందుకు గురువారం అత్తారింటి నుంచి కోనకు పయనమయ్యారు. తొలుత గ్రామంలోని పెంచల ఆలయం నుంచి పల్లకిలో చెంచలక్ష్మి అమ్మవారి ఇంటికి (గిరిజనవాడ) స్వామివారు చేరుకున్నారు. కొత్త అల్లుడి రాకతో గిరిజనవాడలో సంబరాలు అంబరాన్నంటాయి. ఇంటికి వచ్చిన అల్లుడికి గిరిజనులు తమ ఆచారం ప్రకారం పుట్టతేనె, ఇంజేటి గడ్డలు, నారె మొలతాడును సారెగా ఇచ్చారు. ప్రతి ఇంటి వద్ద ప్రత్యేక పందిళ్లు, ముగ్గులు వేసి వధూవరులకు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ముత్తైదువులు వధూవరులను గ్రామ పొలిమేర వరకు సాగనంపారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో దేవేరులతో కలిసి కొలువు దీరిన స్వామివారు గ్రామ శివారులోని గొల్లబోయి ఆలయానికి చేరుకుని తొలిదర్శనం గొల్లబోయికి ఇచ్చారు. అనంతరం బోయలు పల్లకి మోసుకుంటూ 6 కి.మీ కాలినడకన కోనకు పయనమయ్యారు. సహజ సిద్ధమైన చల్లని వాతావరణంలో కొద్ది దూరం, ట్యాంకర్లతో పట్టిన నీటితో చల్లబడ్డ రోడ్డుపై మిగిలిన దూరం వందలాది మంది భక్తులతో కలిసి శ్రీవారు కోనకు చేరారు. ఆలయ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. ఇక్కడ ఆరు రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించుకుని తిరిగి స్వామివారు గోనుపల్లికి చేరుకుంటారు. ఈ సందర్భంగా వారంపాటు గోనుపల్లివాసులు నియమనిష్టలతో మాంసాహారాలకు దూరంగా ఉంటారు. కాగా, కోనలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక స్నపన తిరుమంజనం, విశేష పూజలు జరిగాయి.

ఉత్సవాలకు అంకురార్పణ

పెంచలకోనలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఆలయంలోని అలంకార మండపంలో అర్చకులు, టీటీడీ వేదపండితులు ప్రత్యేక యాగశాలను ఏర్పాటు చేసి నిత్య హోమాలు చేశారు. అర్చకులు పుట్టమన్ను తీసుకొచ్చి అందులో నవధాన్యాలు కలిపి కలశస్థాపన చేసి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. ఎలాంటి ఆటంకాలు జరగకుండా దిగ్విజయంగా ఉత్సవాలు జరిగేందుకు ఈ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం కోన వీధుల్లో సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో 2వ రోజు శుక్రవారం ఉదయం స్వామివారికి తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం, సాయంత్రం శేష వాహనం జరగనుంది.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

కోనలోని లక్ష్మీ నృసింహస్వామి ఆదిలక్ష్మి, చెంచు లక్ష్మి, ఆంజనేయస్వామి వార్లను గురువారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ జేపీ సుధ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఘనస్వాగతం పలికి, స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

రీసర్వేతో ఆన్‌లైన్‌లో తప్పులు

● తప్పుల తడకగా పాసుపుస్తకాలు ● పంట రుణాలు అందక ఇక్కట్లు పడుతున్నామన్న రైతులు ● సరిదిద్దాలంటూ వేడుకోలు

చాపాడు, మే 8 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం 2022-23లో చేపట్టిన భూముల సర్వేతో అన్నదాతలు చాలా ఇబ్బంది పడుతున్నారు. అప్పటి ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం చేయలేదని రైతులు లబోదిబోమంటున్నారు. కేవలం ఎనిమిది నెలల్లోనే రీ సర్వేను అధికారులు పూర్తి చేశారని ఇంత తక్కువ సమయంలో రెవెన్యూ అధికారులు రైతులతో మాట్లాడి భూములను కొలచలేదన్నారు. ఎన్నికల సమయానికి కేవలం రెండు నెలల ముందు అధికారుల పై ఒత్తిడి చేసింది. దీంతో అధికారులు భూములపై కొలతలు కొలువకుండా కేవలం ఆన్‌లైన్‌లో పేర్లను ఆధారం చేసుకుని కాగితాల మీద లెక్కగట్టి వాటికి ఎల్‌పీఎంలు ఇచ్చారన్నారు. దీంతో ఒక సర్వే నంబరులో 10 ఎకరాల భూమి ఉందనుకుంటే ముగ్గురు రైతులు పంచుకోవాల్సి ఉంటుందని ఈ సర్వేలో వారికి 1బీ రావాలంటే మిగతా రైతులు ఒప్పుకోవాల్సి ఉందన్నారు. కానీ వారు ఇందుకు సహకరించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.మండలంలో మొత్తం 32 వేల ఎకరాల భూములు ఉన్నాయి. ఇప్పటి వరకు రీ సర్వే అన్నవరం, మడూరు, వెదురూరు, కుచ్చుపాప, చియ్యపాడు, సోమాపురం, అయ్యవారిపల్లె, చాపాడు, పెద్ద గురవలూరు, మరికొన్ని రెవెన్యూ గ్రామాల పరిధిలో చేశారు. రైతులందరు భూములను బ్యాంకులలో తాకట్టుపెట్టి రుణాలు తీసుకోవాలంటే కుదరడంలేదు. 1బీల కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారం చేపట్టగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నవంబరు నెలలో రీ సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దేందుకు గ్రామసభలు నిర్వహించారు. ఇందులో మొత్తం 315 అర్జీలు రా గా వాటిలో 200 అర్జీలు పరిష్కారం చేసినట్లు అధికారులు తెలిపారు. సర్వేయర్లు, వీఆర్వోలు ఇష్టానుసారంగా భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వడం జరిగిందన్నారు. తమ భూములను మళ్లీ ఆన్‌లైన్ చేయాలని అధికారులను కోరితే ఆధారాలు చూపించాలని కోరుతున్నారన్నారు. 30 ఏళ్ల క్రితం పట్టాదారు పాస్‌పుస్తకాలు తీసుకున్నవారికి ఆధారం లభించాలంటే కష్టంగాఉందని రైతులు పేర్కొంటున్నారు. రైతులు వారి కూతుర్లకు పెళ్లి చేయాలన్నా, కట్న కానుకల కింద భూమి రాసివ్వాలన్నా 1బీ రానందున ఇబ్బంది పడుతున్నారు. సర్వే నంబర్లు 51/2ఎ, 50/1ఎ, 34, 9/11, 17/1, 70/1, 78 వంటి ప్రైవేటు భూములను 2 చోట్ల చేర్చారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూములను మాత్రమే చేర్చాల్సి ఉందని ఇప్పటికైనా అధికారులు తప్పులను సరిదిద్దాలనివారు రైతులు కోరుతున్నారు.

తహసీల్దారు ఏమన్నారంటే..

ఈ రీసర్వే తప్పుల విషయమై తహసీల్దారు రమాకుమారిని 'ఆంధ్రజ్యోతి'వివరణ కోరగా రైతుల భూముల్లో తప్పులు జరిగిన విషయం నిజమేనన్నారు. ఇప్పటికి 200 సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. ఇంకా వంద సమస్యలకు రైతులు వారి భూములకు సరైన ఆదారాలు చూపిస్తే పరిష్కారం చేస్తామన్నారు.

నా భూమి 2.67 ఎకరాలు తొలగించారు



అధికారులు రీసర్వే చేసి నా పట్టా భూమి 2.67 ఎకరాలు ఆన్‌లైన్‌లో నుంచి తొలగించారు. సర్వే నంబరు 121/1బీలో 0.19 సెంట్లు, 47ఎ/వీలో 0.64 సెంట్లు, 47/1సీలో 0.96 సెంట్లు తొలగించారు. సర్వేయర్లు, వీఆర్వోలు నా భూమిని కొలువలేదు. నాకు 3.03 ఎకరాలు భూమి ఉండగా పాస్‌పుస్తకంలో కేవలం 70 సెంట్లు నమోదు చేశారు. 1బీ రాలేదు. బ్యాంకులో రుణం ఇవ్వలేదు. అధికారులు తప్పులను సరిదిద్దాలి.

- వీరారెడ్డి, రైతు, ఓబుళరెడ్డి గ్రామం

25 సెంట్ల భూమి ఏమైందో తెలియదు



రీ సర్వే చేయడంతో నా 25 సెంట్ల భూమి ఆన్‌లైన్‌లో నుంచి తొలగించారు. సర్వే నంబర్లు 70/1లో 20 సెంట్లు, 122లో అయిదు సెంట్ల భూమి మాయమైంది. రెవెన్యూ సదస్సులో తహసీల్దారుకు అర్జీ ఇచ్చారు. బ్యాంకువారు రుణం ఇవ్వలేదు. జాయింట్ పట్టాలకు సబ్‌డివిజన్ కాలేదు. ఈ సమస్యలను పరిష్కరించాలి.

- వీరసుబ్బారెడ్డి, రైతు, ఓబుళరెడ్డిపేట గ్రామం

ఎంఎల్‌హెచ్‌పీల వ్యాఖ్యల పట్ల నిరసన



వైద్యాధికారి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందిస్తున్న ఏఎన్‌ఎంలు.

బద్వేలు రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖలో కీలకంగా పనిచేస్తూ తల్లి బిడ్డల ఆరోగ్యంకోసం అహర్నిశలు కష్టపడుతున్న ఏఎన్‌ఎంలను, సూపర్‌వైజర్లను కించపరిచేలా వాఖ్యలు చేసిన ఎంఎల్‌హెచ్‌పీలు వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకునిబహిరంగ క్షమాపణలు చెప్పాలని ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక సురేంద్రనగర్ అర్బన్‌హెల్త్‌సెంటర్ వైద్యాధికారి శ్రీనివాసులుకు వారొక వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఎన్‌ఎంలను కించపరిచేలా వాఖ్యలుచేస్తూ, అవహేలనగా మాట్లాడుతూ గ్రామాల్లో ఏఎన్‌ఎంలను కించపరుస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలు మానుకోకపోతే ఊరుకునేదిలేదన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా జాయింట్ సెక్రటరీ సుధాభీరావతి, ఏఎన్‌ఎంలు నాగలక్ష్మి, వసుంధర, లక్ష్మీనారాయణమ్మ, సుబ్బనరసమ్మ, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం



హెచ్. సురేష్‌బాబు
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
వైద్యాధికారి, దువ్వూరు

దువ్వూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మైరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రాథమిక ఆరో గ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హెచ్.సురేష్‌బాబు పేర్కొన్నారు. రాత్రివేళల్లో వస్తే అత్యవసర కేసులకు చికిత్సలు చేస్తున్నామని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ప్రశ్న: వైద్య ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల తోపాటు సిబ్బంది ఎందరున్నారు. ?

జవాబు: ప్రధాన వైద్యులు నలుగురు ఉన్నారు. సీహెచ్‌వోలు, ఎఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌టీలు, ఆశావర్కర్లు మండల వ్యాప్తంగా 103 మంది ఉన్నారు.

ప్రశ్న: మండలంలో సచివాలయాలతో కలిపి ఓపీ కేసులు ఎన్నివస్తాయి ?

జవాబు: దువ్వూరు ఆరోగ్య కేంద్రంలో చికిత్స కోసం 140మంది దాకా రోగులు వస్తారు. దువ్వూరు మండలంలో 450 నుంచి 500 మంది చికిత్సకు వస్తారు.

ప్రశ్న: దువ్వూరు పీహెచ్‌సీ పరిధిలో మందుల అందుబాటు, ఇతర సౌకర్యాల కల్పన ఎలా ఉంది?

జవాబు: రోగులకు అందించే మందుల విషయంలో ఎటువంటి కొరత లేదు. రక్త పరీక్షలు, గర్భిణులకు వైద్య సేవలు, డయాలసిస్ చేయడం జరుగుతుంది.

ప్రశ్న: ఇక్కడికి రాత్రివేళ వస్తే అత్యవసర కేసులను చూడటంలేదని ఆరోపణల పై మీరేమంటారు?

జవాబు: సాధారణ కాన్పులు అయితే ఇక్కడ చేస్తాం. కష్టమైన కాన్పులు ఇతరత్రా సమస్యాత్మకమైన వాటిని ఇతర ప్రాంతాలకు సిఫార్సు చేస్తాం.

ప్రశ్న: మండలంలో ఆరోగ్య ఉపకేంద్రాల సమస్యలు ఏవైనా ఉన్నాయా.

జవాబు: చిన్నసింగనపల్లె, ఎర్రబల్లె, దువ్వూరు-2 పరిధిలో ఏర్పాటు కావాల్సి ఉంది.

పారిశుధ్య లోపం లేకుండా చూడాలి

ముద్దనూరు మే 8(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా ఎప్పటి కప్పుడు శుభ్రం చేయాలని డీఎల్‌పీవో తిమ్మక్క పారిశుధ్య కార్మికులకు సూచించారు. ముద్దనూరు, వేల్పుచర్ల, ఉప్పలూరు గ్రామంలో గురువారం ఉదయం డీఎల్‌పీవో తిమ్మక్క పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఇంటింటికీ వెళ్లి తడి,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. అలాగే తడి, పొడి చెత్త వేరు విధానం పై పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, ఈవో నరసింహులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

బద్వేలు, మే 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ ఉద్యోగ, కార్మికులసమస్యల పరిష్కరించాలని గురువారం మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఆమేరకు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అంగీకరించిన జీవోలు జారీ చేయాలన్నారు. ప్రజా సంఘాల నాయకులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు నందమూరి యువసేన మద్దతు



జాతీయ పతాకాలు ప్లకార్డులతో సంఘీభావం తెలుపుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మే8 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో 27మంది పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను తుద ముట్టించడానికి భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావం తెలుపుతున్నట్లు నందమూరి యువసేన సమితి అధ్యక్షుడు గోమేదికం సుదర్శన్ పేర్కొన్నారు. గురువారం పొట్టిపాడు రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జాతీయ పతకాలు ప్లకార్డులతో సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల స్థావరాలను మట్టుపెట్టిన భారత సైన్యానికి దేశం మొత్తం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకట సుబ్బయ్య, మహబుబ్‌బాషా, రామునాయుడు, గుర్రప్ప యాదవ్ పాల్గొన్నారు.

కొండాపురంలో: ఉగ్రవాదాన్ని అణిచివేసేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలో భారతసైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కార్యక్రమం దేశానికి గర్వకార ణమని తాళ్లప్రొద్దుటూరు మాజీ సర్పంచ్ రామసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం మం డలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉగ్రవాద చర్యల పై భారతదేశం తీసుకున్న నిర్ణయాన్ని ప్రపం చంలోని మెజారిటీ దేశాలు సమర్థిస్తున్నాయని తెలిపారు. ఉగ్రవాద స్థావరాలను మట్టుపెట్టి, పోరాటం చేసిన సైనికులకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

నేడు విజయోత్సవ ర్యాలీ

ప్రొద్దుటూరు టౌన్ మే 8(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూరం ద్వారా ఉగ్రవాదులను అంతమొందించిన సైనికులను అభినందిస్తూ 9న విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తు న్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున రావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8:30 గంటలకు ర్యాలీ కొనసాగుతుందని వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

లైబ్రేరియన్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పోరుమామిళ్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శామ్యుల్ డేవిడ్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎమ్‌ఎల్‌ఐసీ ఉత్తీర్ణులై ఉండాలని, కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరని, అనుభవం నెట్, సెట్ పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన వారు ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలోపు కళాశా ల ఆఫీసులో బయోడేట, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను అందజేయాలన్నారు. వివరాలకు 8688192034 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఇంటికో పారిశ్రామికవేత్తే... ప్రభుత్వ లక్ష్యం

● ప్రభుత్వ పథకాలతో ఆర్థికంగా ఎదగాలి : ఎమ్మెల్యే ఆది
● 94.19 ఎకరాల్లో పారిశ్రామిక వాడ ● ఎస్సీలకు 75శాతంతో భూ కేటాయింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ఎర్రగుంట్ల, మే 8(ఆంధ్రజ్యోతి): ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సి.ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం జమ్మలమడుగు నియోజవర్గానికి సంబంధించిన ఎంఎస్‌ఎంఈని ఎర్రగుంట్ల మండలంలోని సుంకేసుల గ్రామ పరిధిలో టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 1న సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. అలాగే నియోజకవర్గానికి ఒక పారిశ్రామిక వాడను ప్రారంభించి ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారు చేయడంలో బాగంగా దీన్ని ప్రారంభించినట్లు తెలిపారు. టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధిని మెరుగుపరచాలన్న ధ్యేయంతో ఎంఎస్‌ఎంఈని ప్రారంభించినట్లు తెలిపారు.

94.15 ఎకరాలు కేటాయింపు: ఎర్రగుంట్ల మండలంలోని సుంకేసుల గ్రామంలో ఏర్పాటు చేసిన ఎంఎస్‌ఎంఈకి 94.19 ఎకరాల భూమిని కేటాయించినట్లు జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఇందులో పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటే ఎస్సీలకు 75శాతం ఉచితంగా భూమి కేటాయిస్తారని ఇతరులకు 50శాతం డబ్బులు కడితే మిగతాది 6నెలల్లో సులభవాయిదాల పద్ధతిలో చెల్లించ వలసిఉంటుందన్నారు. జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం, బద్వేలులో ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మైదుకూరులో, ప్రొద్దుటూరు, కడప నియోజవర్గాల్లో భూమిని కేటాయించిన తర్వాత ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తిప్పలూరు సర్పంచి అంబటి పార్వతమ్మ, మండల ఇన్‌చార్జి మధుసూధన్‌రెడ్డి, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ కమలాకర్, ఏఎంసీ చైర్మన్ నాగరాజు, శివనారాయణరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ ఎం.మోహన్‌రెడ్డి, ఇతర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొండాపురం రైల్వేస్టేషన్‌లో అన్నిరైళ్లను ఆపాలి



కొండాపురం స్టేషన్ సూపరెంటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న కమిటీ, ప్రజాసంఘాలు

కొండాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): కొవిడ్‌కు ముందు కొండాపురం రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ఉన్న అన్ని రైళ్లకు తిరిగి స్టాపింగ్‌ను పునరుద్ధరించాలని, స్టేషన్ కమిటీ ప్రజా సంఘాల నాయకులు డీఆర్‌ఎంను కోరారు. ఈ మేరకు గురువారం వారు కొండాపురం స్టేషన్‌సూపరెంటెండెంట్ గురుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. బ్రిటీష్‌కాలం నుంచి కొండాపురం రైల్వేస్టేషన్‌కు ఒక ప్రత్యేకత ఉందని గతంలో ఇటువైపు వెళ్లే దాదాపు అన్ని రైళ్లకు స్టాపింగ్ ఉండేదన్నారు. కొవిడ్ రైల్వేశాఖను ఏంమాయాచేసిందో గాని రెండు రైళ్ల మినహా అన్ని రైళ్లకు స్టాపింగ్ ఎత్తివేశారని దీంతో చుట్టూ ఐదుమండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యో గస్తులు, రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గతంలో నడిచే అన్ని రైళ్లకు వెంటనే స్టాపింగ్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో డీఆర్‌ఎంను కోరారు. కార్యక్రమంలో స్టేషన్ కమిటీ మెంబర్లు, ప్రజాసంఘాల నాయకులు మనోహర్ బాబు, నాగేష్,జోసఫ్, వెంకటరమణ, సుబ్బారావు, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

రాయితీ వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేత



ముద్దనూరు మే08(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ రాయితీ వ్యవసాయ యంత్ర పరికరాలను గురువారం రైతులకు అందించినట్లు ఏవో వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి సబ్సిడీతో పవర్ స్ప్రేయర్, విత్తన గొర్రు, గుంటకలు, రోటోవేటర్, ట్రాక్టర్ స్ప్రేయర్లు రైతులకు అందించినట్లు తెలిపారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీఈవో గంగయ్య, రైతులు పాల్గొన్నారు.

ఎయిర్‌టెల్ టవర్ ఏర్పాటును అడ్డుకున్న స్థానికులు



ఎయిర్‌టెల్ ప్రతినిధులతో వాగ్వాదం చేస్తున్న స్థానికులు

ప్రొద్దుటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణం దొరసానిపల్లె రోడ్డులో ఎయిర్‌టెల్ టవర్ ఏర్పాటును స్థానిక ప్రజలు అడ్డుకున్నారు. గురువారం స్థానిక దొరసానిపల్లె రోడ్డులోని శ్రీరాంనగర్ ఏరియాలో ఎయిర్‌టెల్ కంపెనీ వారు టవర్ నిర్మాణ పనులు చేపట్టారు. స్థల యజమాని ఇళ్ల సమీపంలో టవర్ ఏర్పాటుచేస్తే తామంతా ఇబ్బందులు పడతామని వారు ఆందోళన చేపట్టారు. ఇందుకు ఎయిర్ టెల్ ప్రతినిధులు టవర్ ఏర్పాటు వల్ల రేడియేషన్ రాదని మాకు అనుమతులు ఉన్నాయని వాదించారు. మున్సిపాలిటీ అనుమతులు ఇచ్చిందని మీ అభ్యంతరాలు అధికారులతో తెలుపుకోవాలని ప్రతినిధులు వెల్లడించారు. స్థానిక ప్రజల అభిప్రాయాలుతీసుకోకుండా అధికారులు ఎలా టవర్లకు అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. ఈ విషయం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఎయిర్‌టెల్ టవర్ నిర్మాణం చేపట్టబోనీయమని మాజీ కౌన్సిల్లర్లు వద్ది బాలుడు, అగ్గారపు శ్రీనివాసులు టీచర్ చంద్రశేఖర్‌లు ఎయిర్‌టెల్ ప్రతినిధులతో వాదించి తాత్కాలికంగా పనులు నిలిపివేయించారు.

అన్నదానం

కలసపాడు, మే 8 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారి ఆరాధనోత్సవాల సందర్భంగా కలసపాడులోని బ్రహ్మంగారి గుడిలో గురువారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. దాతల సహకారంతో ప్రతి ఏడాది ఆరాధనోత్సవాల సందర్భంగా అన్నదానం చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు భాస్కర స్వామి తెలిపారు. పురవీధులలో బ్రహ్మంగారి విగ్రహాన్ని ఊరేగించారు.

కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలి

జమ్మలమడుగు మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి సూచించారు. గురువారం జమ్మలమడుగులోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పంతంగి రామన్నరావు హైస్కూల్‌లో 10వ తరగతిలో ప్రతిభ కనపరిచిన జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, స్థానాలు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో 1 నుంచి ఇంటర్ వరుకు విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వం మంచి ప్రోత్సాహకం అందిస్తున్నదన్నారు. టీడీపీ ఇన్‌చార్జీ భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిచేస్తున్నారన్నారు. చదువు జీవితాన్ని మార్చుతుందని ఆదిశగా విద్యార్థులు అందరూ శ్రమను నమ్ముకుని చదవాలని అన్నారు. ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రులు మంచి ప్రోత్సాహం అందించాలని అన్నారు. చెడు స్నేహలకు దూరంగా ఉండాలని చెప్పారు. అనంతరం జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, స్థానాలు సాధించిన విద్యార్థులకు వారు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు చంద్రశేఖర్, రమణారెడ్డి, చిట్టిబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నేతలు

బద్వేలు, మే 8 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచడంతో పాటు జిల్లాకు ఒకే పేపర్ విధానం , పరీక్షలకు 90 రోజులు గడువు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని కోరారు. గురువారం ఆయన పట్టణంలోని డీవైఎఫ్ఐ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగుల పోరాట ఫలితంగా డీఎస్సీ నోటిఫికేషన్ సాధించుకోడం జరిగిందన్నారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడం హర్షనీయమన్నారు. రాష్ట్రప్రభుత్వం టెక్నికల్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని మన రాష్ట్రంలో కూడా 47 సంవత్స రాల వరకు వయో పరిమితిని పెంచాలని తదితర డిమాండ్‌లు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

బద్వేలు వాసి గోవిందరెడ్డికి డాక్టరేట్ ప్రదానం



బద్వేలు రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని పోలు గారిపల్లెకు చెందిన గోవిందరెడ్డికి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. రసాయన శాస్త్ర విభాగంలో ఆచార్య వైవీ రామిరెడ్డి పర్యవేక్షణలో ఫిజికో కెమికల్ ప్రాపర్టీస్ ఆఫ్ బైనరీ ఆర్గానిక్ లిక్విడ్ మిక్చర్ త్రూ ఎఫ్‌టీఆర్ స్పెక్ట్రల్ అనాలసిస్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈయన కడప నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్నారు.